**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

విజయవాడ,
తేది : 26 ఆగష్టు, 2020.

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
వెలగపూడి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. – **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : గోదావరి వరద బాధితులను ఆదుకోవడం గురించి..**

**అయ్యా,**

తూర్పు గోదావరి జిల్లాలో పోలవరం ముంపు ప్రాంతాలుగా ఉన్న చింతూరు, విఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాలలోని పలుగ్రామాలను, వరద బాధితుల శిబిరాలను, పంటలను నేను ప్రత్యక్షంగా పరిశీలించాను. అక్కడ వాస్తవిక పరిస్తితులను మీ దృష్టికి తీసుకురాదలచాను.

ఈ నాలుగు మండలాలకు చెందిన 120 గ్రామాలకు చెందిన వేలాది ఆదివాసీ కుటుంబాలు దాదాపు తొమ్మిది రోజులుగా ఇల్లు, వాకిలి వదిలిపెట్టి పిల్లలతో సహా సురక్షిత ప్రాంతాలకు చేరారు. ఈ సారి వరదలకు ముందు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు చేయకపోవడంతో ప్రజలు వరద ఇళ్లలోకి ప్రవేశించేదాకా గుర్తించలేదు. నీళ్లు, బురద చేరడంతో విధిలేని పరిస్థితులలో ఎవరికి వారే స్వంత ఏర్పాట్లతో మెరక ప్రదేశాలకు చేరారు. వారికి అధికారికంగా ఎలాంటి సహాయ శిబిరాలను ఏర్పాటు చేయలేదు. ఒక వైపు కరోనా భయం, మరోవైపు గుంపులుగా కలసి ఉండాల్సిన స్థితిలో స్థానిక అధికార యంత్రాంగం వారికి ఐదు కేజీల బియ్యం, అరకిలో కందిపప్పు, అరకిలో ఉల్లిపాయలు, అర లీటరు పాలు, ఒక మంచినీటి ప్యాకెట్ తప్ప ఇంత వరకు ఏమీ ఇవ్వలేదు. చింతూరులోని ఒక శిబిరంలో మాత్రమే వండి పెడుతున్నారు. మిగతా అన్ని చోట్లా రేషనే ఇచ్చారు. విద్యుత్ లేదు. కిరోసిన్‌కు బదులు ఒక చిన్న కొవ్వొత్తి మాత్రమే ఇచ్చారు. అది ఒక గంట కూడా రాదు. పసిపిల్లలకు పాలు ఒక్కరోజు మాత్రమే ఇచ్చారు. ఈ శిబిరాలకు వచ్చిన బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ఎలాంటి అదనపు సహాయమూ లేదు. ఇచ్చిన బియ్యం మనిషికి రోజుకి 120 గ్రాములు మాత్రమే వస్తుంది. ఇలా ఇళ్ళు వదిలిపెట్టి బయటకొచ్చి తలదాచుకున్న నలుగురు ఇప్పటికే చనిపోయినట్లు నా దృష్టికి వచ్చింది. అందులో ఒక గర్భిణీ, ఒక బాలుడు కూడా ఉన్నారు. చాలా మంది జ్వరాలు, దగ్గుతో బాధ పడుతున్నారు. కొన్ని శిబిరాలలో మాత్రమే ఆరోగ్య కార్యకర్తలున్నారు. అన్ని శిబిరాలను మీరు సర్వే చేయిస్తే ప్రజల ఆవేదన అర్థమవుతుంది. సర్వస్వం వదులుకొని వచ్చిన ప్రజలు ప్రభుత్వం అందించిన రేషనుతో ఎలా తిని బతకాలో ఆలోచించగలరు. అత్యంత దయనీయ స్థితిలో వారు నిరాదరణతో బతుకుతున్నారు. ఉన్నతాధికారులెవరూ ఇంతవరకు ఈ శిబిరాలను సందర్శించలేదు. వారు ఇళ్ల ఖాళీ చేయడానికి, తిరిగి సామాను తీసుకుపోవడానికి, శిబిరాలు ఏర్పాటు చేసుకోడానికి ఇప్పటికే స్వంతంగా ఎంతో ఖర్చు చేశారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రు. 2వేల సహాయం ఏ మూలకూ చాలదు. గత సంవత్సరం వరదలకు ప్రకటించిన సహాయం కూడా వారికి ఇంతవరకు అందలేదు. అందువల్ల ప్రకటించిన సహాయంపై బాధితులు చాలా అసంతృప్తితో ఉన్నారని చెప్పడానికి విచారిస్తున్నాను. వరి, పత్తి, మిర్చి నారుమడులు చాలా వరకు మునిగిపోయాయి. పశువులు నష్టపోయారు. ధాన్యం తడిసి పోయింది. ఈ అనాథ ప్రజానీకాన్ని ఆదుకోడానికి కింది చర్యలు తీసుకోవాలని మిమ్ములను కోర్తున్నాను.

**(1)** ప్రతి బాధిత కుటుంబానికి రేషను కార్డుతో నిమిత్తం లేకుండా రు. 15 వేలు ఆర్థిక సహాయం, మనిషికి 5 కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలి. వాటితో పాటు చింతపండు, ఉల్లిపాయలు, నూనె, మిర్చి వంటి కనీస నిత్యావసరాలను కూడా సరఫరా చేయాలి. ప్రజలు తిరిగి కోలుకునేదాకా కనీసం రెండు మాసాల పాటు ఈ సహాయం ఇవ్వాలి.

"త్రిప్పి చూడగలరు"

(2) కొట్టుకుపోయిన ఇంటికి రు.లక్ష, కూలిపోయిన ఇంటికి రు.50 వేలు ఇవ్వాలి.

(3) సామాను తరలింపు ఖర్చు ప్రభుత్వమే భరించాలి. దాని కోసం ప్రతి కుటుంబానికి రు. 2వేలు ఇవ్వాలి.

(4) ప్రతి కుటుంబానికి పది రోజులకు సరిపడా తాగడానికి రక్షిత మంచినీరు అందించాలి.

(5) వరదల్లో కొట్టుకుపోయినా, చనిపోయిన ఆవులు, గేదెలకు రు.25 వేలు చొప్పున పరిహారం అందించాలి.

(6) వరద ముంపులో పాడైపోయిన పత్తి, వరి పంట పొలాలకు ఎకరానికి రు. 25 వేలు పరిహారం ఇవ్వాలి.

(7) శిబిరాలలో తలదాచుకున్న ప్రజలకు, బురదనీరు ఇంకా కొనసాగుతున్నందున ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వారందరికీ వెంటనే కోవిడ్ టెస్టులు చేయించాలి. అన్ని ప్రాంతాలలో బ్లీచింగు చేయించాలి. బాధిత ప్రజలకు మాస్కులు, శానిటైజరు అందించాలి.

**అయ్యా,**

సమస్య తీవ్రత దృష్ట్యా ఈ గిరిజనాన్ని ఆదుకోడానికి సహృదయంతో ముందుకు రావాలని, భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల్లో ముందుగానే మేల్కొని అధికార యంత్రాంగం ప్రజలను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

అభివందనాలతో...

**(వి. శ్రీనివాసరావు)**

సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యుడు